క్లుప్తంగా

ఎన్నికలప్పుడే ఎస్సీ, ఎస్టీ బీసీలు కనిపిస్తారా..?


మాట్లాడుతున్న కాలప్ప

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన పార్టీలకు ఎన్నికల సమయానికే ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారు గుర్తుకు వస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడు ఎన్నికల వచ్చినప్పుడే పేదలు గుర్తుకు వచ్చారా అని నిలదీశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ థామస్ ఎస్సీ, ఎస్టీ, బీసీల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం


ఊరేగింపులో స్వామి, అమ్మవార్లు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతసేవతో ఆలయాన్ని తెరచి నిత్య పూజాకైంకర్యాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చన పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

దీపోత్సవాన్ని విజయవంతం చేయండి

నగరి: మండల పరిధిలోని తరణి గ్రామంలోని శ్రీవైకుంఠనాథస్వామి ఆలయంలో అయోధ్య రాముని అక్షింతలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన వారు ఆలయం వద్దకు వచ్చి స్వీకరించాల్సిందిగా సర్పంచ్ నిర్మల డింపుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నూతనంగా నిర్మించిన మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే శ్రీరామ రక్షిత అక్షింతలు ప్రతి ఇంటికి అందజేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఆలయంలో రామభక్తులతో కలిసి భజనలు, రామకీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొనాలని కోరారు. సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత ఇంటిముందు దీపాలు వెలిగించి దీపోత్సవ పండుగను విజయవంతం చేయాలని కోరారు.

సంతాన ప్రాప్తినిచ్చే స్వామి పాదం

సంతాన ప్రాప్తిని సిద్ధించే మహిమాన్విత శ్రీవేంకటేశ్వరస్వామి పాదం పుత్తూరు పట్టణ పరిధిలోని రాసపల్లి గ్రామ గుట్టమీద వెలసి ఉంది. ఈ గ్రామానికి పశ్చిమ దిశగా 3కిలో మీటర్ల దూరంలో ఈ పాదం దర్శనమిస్తోంది. ఈ గుట్టస్వామి పాదంగుట్టగా కీర్తించబడుతోంది. ఇక్కడి స్వామి పాదాన్ని నమ్మి కొలిస్తే కోరిన కోరిక తప్పక నెరవేరుతుందని ఈ ప్రాంతవాసుల ప్రగాఢ విశ్వాసం. అయోధ్య రాముడి ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం స్వామి పాదానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


రాసపల్లిలో స్వామిపాదం గుట్ట

- అయోధ్య రాముడి ప్రతిష్ఠను పురస్కరించుకొని..
- స్వామి పాదానికి ప్రత్యేక పూజలు
- రాసపల్లి గుట్టపై గ్రామస్తులచే ఏటా సంతర్పణ
- సంతర్పణ రోజున తప్పక చిరుజల్లులు కురుస్తాయి
- టీటీడీ ఆధీనంలోకి తీసుకోవాలంటున్న గ్రామస్తులు

పుత్తూరు: రాసపల్లి గుట్టమీద వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి పాదానికి చరిత్ర ఉంది. గ్రామ పూర్వీకుల కథనం మేరకు ఆకాశరాజు కుమార్తె పద్మావతీదేవిని శ్రీవేంకటేశ్వరస్వామి నారాయణవనంలో వివాహం చేసుకుంటారు. పెళ్లి తర్వాత ఏదైనా కొండపైన స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. స్వామి రాసపల్లి కొండపై కాలుమోపగా కొండ కుంగిపోవడంతో అక్కడ రెండో పాదం మోపకుండా అప్లాయగుంట, శ్రీనివాసమంగాపురం మీదుగా శేషాచలం కొండలపైకి వెళ్లి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటారు. రాసపల్లి కొండ కుంగడంతోపాటు గుట్టగా మారి అక్కడ స్వామి పాదం ఏర్పడడంతో ఈప్రదేశాన్ని స్వామి పాదం గుట్టగా మారిపోయింది.

సంతర్పణ ఇలా..

ప్రతి ఏటా జూన్‌లో రాసపల్లి గ్రామస్తులు అందరూ కలిసి, బియ్యం, వంట సామగ్రిని విరాళాలుగా సేకరిస్తారు. ఇంటికొక్కరు చొప్పున కనీసం వంద మంది కలిసి కాలిబాటనే గుట్టపై భాగానికి చేరుకొంటారు. స్వామిపాదానికి దగ్గరలో ఎప్పుడూ నీళ్లు ఉండే గుంట ఒకటి ఉంది. సమీపంలోనే దొన ఉంది. ఇందులోని నీరు తియ్యగా తాగడానికి అనువుగా ఉంటాయి. అందరూ ముందుగా గుంటలో స్నానాలు ఆచరిస్తారు. అనంతరం స్వామిపాదానికి పసుపు రాసి, కుంకుమ బొట్లు పెడతారు. అక్కడే పెద్ద పెద్ద పొయ్యిలు తయారు చేసి, కట్టెల మంటలపై వెంట తీసుకొచ్చిన బియ్యాన్ని వండుతారు. ఎలాంటి వస్త్రం పరచకుండా పెద్ద బండపైనే అన్నాన్ని ఆరబోసి, చింతపండు పులుసుతో పులిహోరా తయారు చేస్తారు. పులిహోరాతో పాటు వెంట తీసుకొచ్చిన వడపప్పు, బెల్లం పానకాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. టెంకాయలు కొట్టి, కర్పూర హారతులిస్తూ గోవిందా..గోవింద అంటూ నామస్మరణతో తన్మయత్వం పొందుతారు. అక్కడే ప్రసాదాలు స్వీకరించి తిరుగు ప్రయాణం అవుతారు. ఇక్కడికి వచ్చి సంతర్పణలో పాల్గొన్న వారి కోర్కెలు తప్పక తీరుతాయని ప్రతీతి. పూజ అనంతరం తిరుగు ప్రయాణంలో భక్తులపై చిరుజల్లులు కురవడం తథ్యమని అదే ఆ వేంకటేశ్వరుని మహత్యంగా ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం.

స్వామి పాదానికి మార్గం..

పుత్తూరు పట్టణం నుంచి 2 కిలో మీటర్ల దూరంలో రాసపల్లి గ్రామం ఉంది. అక్కడి నుంచి 3కిలో మీటర్ల దూరంలో స్వామిపాదం గుట్ట ఉంది. తిరుపతి నుంచి వచ్చేటప్పుడు పుత్తూరు పట్టణానికి ముఖద్వారంగా ఉన్న వైఎస్సార్ సర్కిల్ నుంచి పర్లాంగు దూరంలోనే రాసపల్లి ఉంది. మరో మార్గమైన చెర్లోపల్లి గ్రామం నుంచి 3కిలోమీటర్ల దూరంలోనే స్వామి పాదం గుట్ట ఉంది. ఎటు నుంచి వెళ్లాలన్నా మోటర్ సైకిళ్లపైనే వెళ్లాలి. కార్ల వంటి వాహనాలు వెళ్లడానికి దారి అనువుగా లేదు.


రాసపల్లి గుట్టపై వెలసిన స్వామి వారు, పాదం

పాదపూజతో సంతానం కలిగింది:



నా వయస్సు 71 ఏళ్లు. రాచపాళెం గ్రామానికి చెందిన మా తండ్రి పెద్దనారాయణరాజుకు పెళ్లై 13 ఏళ్లు గడిచినా సంతానం కలగలేదు. సంతానం కలుగుతుందనే నమ్మకంతో గుట్టపైకి వెళ్లి, పాదాన్ని గుర్తించి, పూజలు చేసి, చిన్నపాటి ఆలయాన్ని కట్టించడంతో పాటు వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదే ఏడాది నారాయణరాజు భార్య దేశమ్మ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. స్వామి కృపతో సంతానం కలగడంతో ఆ బిడ్డకు వెంకటసుబ్బమ్మగా నామకరణం చేశారు. తర్వాత నలుగురు మగ బిడ్డలు సైతం పుట్టారు. అందులో నేను చిన్నవాడిని. గ్రామస్తులందరూ కలిసి ప్రతి ఏటా జూన్‌లో స్వామి పాదానికి సంతర్పణ చేయడం ఆనవాతీగా వస్తోంది.

–జి.నరసింహరాజు, రాచపాళెం

టీటీడీ చొరవ చూపాలి..



రాచపాళెం గుట్టను టీటీడీ తమ ఆధీనంలోకి తీసుకొని, అభివృద్ధి చేసి, అందరికీ స్వామి పాద దర్శన భాగ్యం కల్పించాలన్నది గ్రామస్తుల కోరిక. ఇప్పటికీ సంతానవరం పొందేందుకు చాలా మంది ఇక్కడికి వచ్చి పూజలు చేస్తుంటారు. రాచపాళెం నుంచి రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే గుట్టపై ఆలయాన్ని నిర్మించి స్వామి పాదం విశిష్టతను వెలుగులోకి తీసుకురావాలి. టీటీడీ చేపడితే గుట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లడం ఖాయం.

–ఎ.హరిప్రసాద్, రాచపాళెం

క్రికెట్ విజేత టీకేఎం పేట జట్టు


టీకేఎంపేట క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ లత, నేతలు

కార్వేటినగరం: యువతను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడ పోటీలను నిర్వహిస్తోందని ఎంపీపీ లత తెలిపారు. స్థానిక ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన టీకేఎంపేట క్రీడాకారులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీఓ మోహన్ మురళి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడా జట్టు నియోజకవర్గం స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపి కార్వేటినగరం మండలానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయ వర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, ఈవో పీఎస్ మణి, పీడీలు మురళీకృష్ణరాజు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ వర్కింగ్ జనరల్ సెక్రటరీగా మురళీధర్

తిరుపతి రూరల్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ జనరల్ సెక్రటరీగా ఆర్.మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎన్‌టీయూసీ మూడు జిల్లాల అధ్యక్షుడు లేబూరి రత్నకుమార్ అధ్యక్షతన ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో మూడు జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులపై అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, కార్మికుల సమస్యల పరిష్కారంపై విస్తృత చర్చ నిర్వహించారు. మండలస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయిలో యూనియన్ బలోపేతం చేయాలని తీర్మానం చేశారు. అనంతరం నూతన వర్కింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న కార్మిక సంఘ నాయకుడు మురళీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు రత్నకుమార్ చేతులమీదుగా మురళీధర్‌కు అందజేశారు.

చురుగ్గా వ్యవసాయ పనులు


చెరుకు తోటలో కలుపు తీస్తున్న మహిళలు

పాలసముద్రం: మండలంలోని రైతులు చెరుకు, వరి, వేరుశనగ పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం కలుపు తీసే పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మహిళలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఉపాధి హామీలో 100 రోజులు పని దినాలు పూర్తయిన మహిళలు వ్యవసాయ పనులకు వెళుతున్నారు.

శరవేగంగా 50 పడకల ఆస్పత్రి పనులు

- అందుబాటులో వైద్య నిపుణులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కార్వేటినగరం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా నాడు–నేడు కింద ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారు. భవనాల నిర్మాణంతోపాటు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమిస్తున్నారు. మౌలిక వసతులను కల్పిస్తూ పేదలకు స్థానికంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో రూ.23 కోట్లతో రెండు 50 పడకల ఆస్పత్రులను మంజూరు చేశారు. భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అన్ని విభాగాలకు వైద్యనిపుణులను నియమించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

వైద్యసేవలు బాగున్నాయి



ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో సిబ్బంది ఉండేవారు కాదు. ఇప్పుడు ప్రభుత్వం 50 పడకల ఆస్పత్రిని మంజూరుచేసింది. డాక్టర్లు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో మండల ప్రజలు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గంగయ్య, పాదిరికుప్పం, కార్వేటినగరం

కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు



పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం 50 పడకల ఆస్పత్రిని తీసుకొచ్చింది. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పూర్తయిన వెంటనే అన్ని రకాల ఆపరేషన్లు చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత వైద్య సేవలు అందించడం మా అదృష్టంగా భావిస్తున్నాను.

– డాక్టర్ మురళీకృష్ణ, కార్వేటినగరం

అన్ని వ్యాధులకు వైద్య సేవలు



గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది, డాక్టర్లు ఉండేవారు కాదు. మందులు కూడా లేని పరిస్థితి. నేడు 50 పడకల ఆస్పత్రి వచ్చాక అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి కృతజ్ఞతలు.

–లక్ష్మమ్మ, ఆర్కేవీబీ పేట, కార్వేటినగరం

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యం



50 పడకల ఆస్పత్రి భవనాల నిర్మాణం పూర్తయిన వెంటనే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులతోపాటు పాముకాటు, విషం తీసుకున్న వారికి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తాం. పేదలకు కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్న ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ టీఆర్ పాండియన్, ఎండీ జనరల్ మెడిసిన్, కార్వేటినగరం

అపూర్వ కలయిక


గురువులతో పూర్వ విద్యార్థులు

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం హైస్కూల్లో 1985–86లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి మధుర స్మృతులు, చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దొరైరాజ్, కృష్ణన్, దేవరాజులునాయుడు, రామానాయుడు, మాధవన్, మోహన్ పిళ్లై, మనోహర్‌కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం పాద పూజ చేసి గురుభక్తిని చాటుకున్నారు. సమావేశం నిర్వహించడానికి ముఖ్య కారకులైన రాజేంద్ర నాయుడు, నటరాజ్ మొదలి, ఏకాంబరం రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డిని అభినందించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: పీఆర్‌టీయూ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను డీఈఓ విజయేంద్రరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాశ్‌రెడ్డి, కణ్ణన్ ఉపాధ్యాయుల సమస్యలపై డీఈఓతో చర్చించారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటేనే జగనన్న


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి): అభివృద్ధి అంటేనే జగనన్న అని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాభివృద్ధి ముందంజలో ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, క్రీడాశాఖ మంత్రి శ్రీమతి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం మల్లారెడ్డికండ్రిగ ఆది ఆంధ్రవాడలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆమె ప్రారంభించారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక పచ్చ మీడియా జగనన్నపై తప్పుడు రాతలు రాస్తున్నాయని, ప్రజలు వాటిని నమ్మరని అన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు రూ.3 వేలు అందిస్తున్నారని గుర్తుచేశారు. పార్టీ అధ్యక్షుడు గోపీనాథ్, నేతలు శరత్, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కుమార్, సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి


వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: మండలంలోని వరి, వేరుశనగ సాగు చేసే రైతులు తగిన మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. శ్రీకావేరిరాజుపురం పంచాయతీ చెరుముందర కండ్రిగ గ్రామంలో ఆదివారం రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటలకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని సూచించారు. తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. జింక్ సల్ఫేట్, బోరాన్, జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. అపరాలతో పంట మార్పిడి చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే అధిక దిగుబడి వస్తుందని వివరించారు. వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, కత్తెర పురుగు యజమాన్యం గురించి తెలియజేశారు. బిందుసేద్యం పద్ధతిలో చెరుకు సాగు చేయాలని, డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి పంట సాగు చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వరిలో ఆకుముడత, కాండము తొలుచుపురుగు నివారణ, చెరుకులో ఎరువులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పుత్తూరులో అయోధ్య శోభ

పుత్తూరు: అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠను పురస్కరించుకుని పట్టణంలో పండుగ శోభ సంతరించుకొంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు రెండు రోజులుగా పట్టణంలోని ఆలయాల్లో స్థానిక సంఘ్ పరివార్ సభ్యులు పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో తోరణాలు కట్టి పండుగ శోభ కల్పించారు. ఆదివారం రాత్రి స్థానిక భక్త ఆంజనేయస్వామి ఆలయంలో క్షత్రియ సంఘం నాయకులు మురళిరాజు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ఆధ్వర్యంలో పండరీ భజన నిర్వహించారు. పరివార్ నాయకుడు కె.బాబు మాట్లాడుతూ సోమవారం అయోధ్య శ్రీరామ జన్మభూమిలో నూతనంగా నిర్మించిన మందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి పట్టణంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భజనలు, రామకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత ఇంటి ముందు దీపాలు వెలిగించి దీపోత్సవ పండుగను విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్లు మునిచంద్ర, మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, పరివార్ సంఘ నాయకులు సుబ్రమణ్యం పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న పండితులు

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


క్రికెట్ విజేతలకు కప్ అందజేస్తున్న మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి

- రాష్ట్ర ప్రభుత్వ విదేశీ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి
- పులిగుంటేశ్వర క్రికెట్ టోర్నమెంట్ విజేత బి.అగ్రహారం టీం

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విదేశీ సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి తెలిపారు. పులిగుండు వద్ద ఆదివారం పులిగింటేశ్వరస్వామి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు జరిగాయి. గుంటిపల్లె, బి.అగ్రహారం జట్లు తలపడగా విజేతగా బి.అగ్రహారం జట్టు, రన్నర్‌గా గుంటిపల్లి జట్టు నిలిచింది. వారికి రూ.35 వేలు, రూ.17.500 నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడాకారుల ప్రోత్సాహానికి అనేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎంపీపీ హేమలతారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఏటా సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని పులిగుండు వద్ద గుంటిపల్లి వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ మహా సముద్రం సురేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, దీపురెడ్డి, కమల్‌నాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తేజకిరణ్‌రెడ్డి, భాను పాల్గొన్నారు.